క్లుప్తంగా

అయ్యప్ప ఆలయంలో అన్నదానం



భక్తులకు అన్నం వడ్డిస్తున్న నిర్వాహకులు

షాద్‌నగర్: పట్టణంలోని శివ మారుతీ గీతా అయ్యప్ప మందిరంలో కల్పవృక్ష ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు నాగిళ్ల కుమార్, మాజీ కౌన్సిలర్ రేటికల్ నందీశ్వర్, దాస కృష్ణయ్య, మల్లికార్జున్, ఆర్‌ఎన్ రాజు, శ్రీధర్, శ్రీనాథ్, పాండు, దేవదాస్, సుమంత్, మల్లేశ్, క్రాంతికుమార్, ఆలయ మేనేజర్ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



రైతుకు నగదు అందిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

కేశంపేట: మండల పరిధిలోని నిర్దవెళ్లి గ్రామానికి చెందిన బడక సత్యనారాయణ పాడి ఆవు ఆదివారం పిడుగుపాటుకు మృతి చెందింది. పాడిపైనే ఆధారపడి జీవిస్తున్న బాధిత రైతును దాతలు ఆదుకోవడానికి సోమవారం ముందుకొచ్చారు. ఇందుకుగాను జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వర్కాల లక్ష్మీనారాయణగౌడ్ రూ.5వేల చొప్పున, తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన కరుణాకర్ రెడ్డి రూ.3వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో బద్కు వెంకటయ్య, పల్లాటి కృష్ణయ్య, తోట వెంకటేశ్, గుత్తి రంగయ్య, మల్లయ్య, జంగాచారి, బండ నిరంజన్, రాములు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

సీఐ నరహరి



విద్యార్థినులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కేశంపేట: పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని సీఐ నరహరి అన్నారు. మండల పరిధిలోని నిర్దవెళ్లి గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు హైదరాబాద్‌కు చెందిన బీటెక్ విద్యార్థినులు చలసాని ప్రతిక, చలసాని హన్సికలు వాటర్ ప్లాంట్‌ను అందించారు. దీనిని సీఐ, పాఠశాల ఉపాధ్యాయులు, బీటెక్ విద్యార్థులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవాగుణంను కలిగి ఉండాలని సూచించారు. అనంతరం వాటర్ ప్లాంట్ అందించిన బీటెక్ విద్యార్థినులను ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ చెదురువెళ్లి భాస్కర్‌గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి, గ్రామస్తులు నాగరాజు, మధుసూదన్‌రెడ్డి, శ్రీశైలం, జంగయ్య, ముత్యాలు, ఖాజాపాషా తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న చర్చి సభ్యులు, నాయకులు

మొయినాబాద్: ఈస్టర్ వేడుకల్లో భాగంగా మెథడిస్ట్ చర్చి ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. సోమవారం మొయినాబాద్ మెథడిస్ట్ చర్చి ఆవరణలో జరిగిన టోర్నమెంట్‌లో పలు జట్లు హోరాహోరీగా తలపడగా.. విజేతగా ది రైసర్స్ జట్టు, రన్నర్స్‌గా జూడహిట్స్ జట్టు నిలిచాయి. విజేతలకు టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మెథడిస్ట్ సెంట్రల్ చర్చి జిల్లా అధికారి విజయరావు, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు మహేశ్, ఆర్గనైజర్లు శాంతికుమార్, అంకిత్, సందీప్, రాహుల్, నాయకులు ప్రవీణ్, పరమేశ్, శ్రీనివాస్, చంద్రబాబు, వరప్రసాద్, శ్రీకాంత్, రాజ్‌కుమార్, కొండల్, ప్రవీణ్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరులో షెల్టర్ లేక ఎండలో నిల్చున్న ప్రయాణికులు



బస్సు కోసం దర్గా బస్టాప్‌లో రోడ్డుపైనే వేచిచూస్తున్న ప్రయాణికులు

నిలువ నీడ కరువు

కొత్తూరు, తిమ్మాపూర్ ప్రధాన కూడళ్లలో సౌకర్యాల లేమి

- ఎండ, వానలోనూ తప్పని తిప్పలు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

కొత్తూరు: ఆర్టీసీని ఆదరించాలి.. బస్సుల్లోనే ప్రయాణం చేసి సంస్థను కాపాడాలి అంటూ ఆర్టీసీ అధికారులు తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కానీ సంస్థ బలోపేతానికి తగ్గట్లుగా చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. దీంతో ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల కంటే ప్రైవేట్ వాహనాల్లోనే ఎక్కువగా ప్రయాణం చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. కనీసం ప్రధాన గ్రామాలు, కూడళ్ల వద్ద ప్రయాణికులు బస్సుల కోసం వేచిచూసేందుకు బస్టాండ్లు, షెల్టర్లు కరువయ్యాయి. దీన్ని అధిగమించడానికి ఆర్టీసీ, ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

సౌకర్యాలు కరువు..

మండలంలో ప్రధానంగా కొత్తూరు, తిమ్మాపూర్ ఈ రెండు కూడళ్ల నుంచి వందల సంఖ్యలో ప్రయాణికులు నిత్యం ఆయా ప్రాంతాలకు పనుల నిమిత్తం రాకపోకలు కొనసాగిస్తుంటారు. వీరితో పాటు శంషాబాద్, హైదరాబాద్ కళాశాలలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య కూడా వందల సంఖ్యలోనే ఉంటుంది. అయినప్పటికీ ఈ రెండు చోట్ల బస్టాండ్లు, బస్ షెల్టర్లు లేవు. ఇక్కడ ప్రయాణికులు బస్సులు వచ్చేవరకు ఎండలోనే నిలబడాలి. తాగునీటి సౌకర్యం కూడా కరువే. కనీసం కూర్చునేందుకు వీలుగా ఎలాంటి సౌకర్యాలు ఆర్టీసీ సంస్థ కల్పించ లేదు. నిత్యం ప్రయాణికులను ఆయా చోట్లకు చేరవేసేందుకు వీలుగా పదుల సంఖ్యలో ఆర్టీసీ బస్సులు ఈ కూడళ్ల నుంచే రాకపోకలు కొనసాగిస్తున్నాయి.

ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు..

కూడళ్ల వద్ద ఆర్టీసీ బస్సుల కోసం వేచిచూసేందుకు సరైన సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో బస్సుల కోసం వేచిచూస్తున్న సమయంలో ప్రైవేట్ వాహనాలు వస్తే అందులో ప్రయాణం సాగిస్తున్నారు. ప్రస్తుతం ఈ రెండు కూడళ్ల నుంచి ప్రయాణికులను వివిధ ప్రాంతాలకు చేర్చడానికి వందల సంఖ్యలో ప్యాసెంజర్ ఆటోలు, జీపులు తిరుగుతున్నాయి. ఈ కూడళ్ల వద్ద ప్రయాణికులు ఎక్కువగా ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తుండడంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ తగ్గుతోంది. దీంతో ఆర్టీసీ సర్వీసులకు నష్టాలు వచ్చే అవకాశం ఉంది.

బస్ షెల్టర్లు నిర్మించాలి



కొత్తూరు, తిమ్మాపూర్ గ్రామాల నుంచి నిత్యం వందల సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు ఆయా ప్రాంతాలకు రాకపోకలు కొనసాగిస్తుంటారు. కూడళ్ల వద్ద బస్ షెల్టర్లు లేకపోవడంతో బస్సుల కోసం వేచి చూడకుండా ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. షెల్టర్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రయాణికులకు సౌకర్యాలు కల్పిస్తే ఆర్టీసీకి చాలా వరకు లాభం చేకూరుతుంది.

– కర్రోళ్ల సురేందర్, కొత్తూరు

స్థలం కేటాయిస్తే షెల్టర్లు నిర్మిస్తాం

కొత్తూరు, తిమ్మాపూర్ కూడళ్ల వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్లు నిర్మించడానికి ఆర్టీసీ సంస్థ సిద్ధంగా ఉంది. కాకపోతే ఈ రెండు చోట్ల స్థలం లేని కారణంగా షెల్టర్లు నిర్మించడం లేదు. బస్ షెల్టర్ల నిర్మాణం కోసం గతంలో ప్రజాప్రతినిధులను కలిసినా స్పందన లేదు. ఇప్పటికైనా స్థలం కేటాయిస్తే ప్రయాణికుల సౌకర్యార్థం బస్‌షెల్టర్లు నిర్మిస్తాం.

– ఉష, డిపో మేనేజర్, షాద్‌నగర్

పట్టుదల ఉంటే విజయాలు వెన్నంటే

ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె



ఇన్నోవేషన్ సెల్‌లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థినులు

షాద్‌నగర్: విద్యార్థులలో ఏదైనా సాధించాలనే కృషి, పట్టుదల ఉంటే విజయాలు వెన్నంటే ఉంటాయని ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె అన్నారు. సోమవారం పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనం ఆవరణలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ సెల్‌లో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో పాటు విషయ పరిజ్ఞానంతో కూడిన విద్యనభ్యసించాలని సూచించారు. విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. భవిష్యత్‌లో మరెన్నో సమస్యలకు సృజనాత్మకంగా ఆవిష్కరణలు చేపట్టే దిశగా విద్యార్థులు ముందడుగు వేయాలని ఆకాంక్షించారు. ఉన్నత విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రతీ విద్యార్థి ఉన్నత విద్యావంతులుగా ఎదిగి నవభారత నిర్మాణంలో భగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీజీఐసీ కన్వీనర్ పద్మజ, ఐఐసీ కన్వీనర్ స్పందన, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సృజన, తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ రమణమ్మ, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

నేడు దివంగత ఇంద్రారెడ్డి వర్ధంతి కార్యక్రమాలు

మొయినాబాద్: మాజీ హోంమంత్రి దివంగత ఇంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కొత్త నర్సింహారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పాల్గొంటారని, ఉదయం 8.30 గంటలకు చిలుకూరు, 9 గంటలకు రెడ్డిపల్లి, 9.45 గంటలకు మొయినాబాద్‌లో దివంగత ఇంద్రారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని తెలిపారు. ఆయా కార్యక్రమాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇంద్రన్న అభిమానులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి

పశువైద్యాధికారి అహ్మద్



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యులు

మొయినాబాద్: పాడి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి అహ్మద్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్‌లో సోమవారం గాలికుంటు నివారణ టీకాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 245 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ప్రసన్నకుమార్, భీంరావ్, గోరేమియా తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

సీడీపీఓ షబానా బేగం



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ షబానా బేగం, అంగన్‌వాడీ సిబ్బంది

షాద్‌నగర్: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ షబానా బేగం అన్నారు. పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్ల గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ.. పౌష్టిక విలువలతో కూడిన ఆహారం తీసుకుంటే రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను మరింత పటిష్టం చేయడానికి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు ఉమాదేవి, సుజాత, ఆశకార్యకర్తలు మరియారాణి, హెచ్‌ఎం ఇమాన్యుల్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో రోగ నిరోధకశక్తి పెంపు

కొందుర్గు: గర్భిణులు, బాలింతలు విధిగా పోషకాహారం తీసుకొని రోగ నిరోధకశక్తి పెంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీత అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం వీరన్నపేట, కొందుర్గు మండలం చెక్కలోనిగూడ గ్రామంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం కార్యక్రమాలు చేశారు. అదేవిధంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోత్స్న, అంగన్‌వాడీ టీచర్లు ఇందిర, భాగ్యమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయం మంజూరు చేయాలని వినతి



జిల్లా గ్రంథాలయ చైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నేతలు

నందిగామ: మండల కేంద్రానికి గ్రంథాలయం మంజూరు చేయాలని కోరుతూ స్థానికులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్‌రెడ్డికి సోమవారం కొత్తూరులో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటైన నందిగామ మండల కేంద్రంలో ఇప్పటివరకు గ్రంథాలయం లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నందిగామకు వీలైనంత తొందరలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని వారు వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యులు కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, దేపల్లి కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహ, నాయకులు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్, ముర్తూజగూడ, మండల పరిధిలోని నజీబ్‌నగర్, కాశీంబౌలి, అమ్డాపూర్ గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ హమునాయక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్లకొమ్మల తొలగింపు కారణంగా శ్రీనిధి ఫీడర్, ముర్తూజగూడ ఫీడర్, విజయ్‌నవ్య ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు, అమ్డాపూర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, ఆయా గ్రామాల రైతులు, విద్యుత్ వినియోగదారులు అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

ఈదురుగాలులకు ఒరిగిన హోర్డింగ్

తాత్కాలికంగా రోడ్డు మూసివేత



ప్రమాదకరంగా హోర్డింగ్

శంకర్‌పల్లి: పట్టణం, మండలంలో సోమవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడింది. దీంతో పలుచోట్ల చెట్లు విరిగిపోవడం, స్తంభాలు, హోర్డింగులు ఒంగిపోయాయి. పట్టణంలోని ఎస్‌బీ సూపర్‌మార్కెట్ బిల్డింగ్‌పైన అనుమతిలేని హోర్డింగ్ ఈదురుగాలుల దాటికి ప్రమాదకరంగా పక్కకు ఒరిగింది. మున్సిపల్ కమిషనర్ యోగేశ్, పరిశీలించి, అటు వైపు నుంచి సాయినగర్ కాలనీకి మార్గాన్ని తాత్కాలికంగా మూసి వేయించారు. అనుమతి లేకుండా హోర్డింగ్ పెట్టిన వారిపై చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్



బ్రోచర్‌లు ఆవిష్కరిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు

షాబాద్: విద్యార్థులకు ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని బ్రోచర్‌లు ఏర్పాటు చేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత విద్యార్హత కలిగిన ఉపాధ్యాయులతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. డిజిటల్ తరగతి బోధన, ఏఐ తరగతులు, ఎన్నో వినూత్న పద్ధతుల్లో బోధన అందిస్తున్నట్లు వివరించారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. అదే పాఠశాలలో చదువుతున్న విద్యార్థికి గురుకుల పరీక్షల్లో జిల్లాస్థాయిలో మొదటి ర్యాంక్ రావడం సంతోషకరమని, ఆ విద్యార్థిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మన్ మద్దూర్ మల్లేశ్, మాజీ సర్పంచ్ మద్దూరు శకుంతల, ఎంపీటీసీ మాజీ సభ్యులు మద్దూరు పాండు, గుత్తి సునీత, నాయకులు రామస్వామి, చెన్నయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

కూరగాయలు స్వేచ్ఛగా అమ్ముకోనివ్వాలి

గుడిమల్కాపూర్ రైతు సంఘం అధ్యక్షుడు కొమ్మిడి దశరథ్‌రెడ్డి



చైర్మన్, వైస్ చైర్మన్‌తో దశరథ్‌రెడ్డి, ఫిషర్‌మెన్ జిల్లా చైర్మన్ మహేందర్‌ముదిరాజ్

మొయినాబాద్‌రూరల్: గుడిమల్కాపూర్ మార్కెట్‌లో రైతులకు స్వేచ్ఛగా కూరగాయలు అమ్ముకునేందుకు అవకాశం కల్పించాలని గుడిమల్కాపూర్ రైతు సంఘం అధ్యక్షుడు కొమ్మిడి దశరథ్‌రెడ్డి రైతులతో కలిసి మార్కెట్ చైర్మన్ తలారి మల్లేశ్, వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌ను కోరారు. సోమవారం ఈ విషయమై మండల పరిధిలోని బాకారం గ్రామానికి చెందిన రైతులు, కాంగ్రెస్ పార్టీ ఫిషర్‌మెన్ జిల్లా చైర్మన్ మహేందర్‌ముదిరాజ్‌తో కలిసి దశరథ్‌రెడ్డి వారికి వివరించారు. ప్రస్తుతం గుడిమల్కాపూర్ మార్కెట్‌లో రైతులు తీసుకొచ్చిన కూరగాయలను హోల్‌సెల్‌గా అమ్మాలని నిబంధనలను పెట్టడంతో రైతులకు నష్టం కలుగుతుందని ఆరోపించారు. రైతులు పండించే పంటలు హోల్‌సెల్‌తో పాటు స్వేచ్ఛగా అమ్ముకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. దీంతో వారు దీనిని పరిశీలిస్తామని తెలిపినట్లు పేర్కొన్నారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో రైతులు రవీందర్‌రెడ్డి, కిష్టయ్య, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణ, మోహన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి బిల్లులు వెంటనే చెల్లించాలి

కొందుర్గు: ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం జంగయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధి కూలీలపై చిన్నచూపు చూపిస్తుందన్నారు. వేసవి తాపానికి తట్టుకొని కూలీలు పనిచేస్తే రోజుకు రూ.200లు కూడా రావడం లేదని ఆరోపించారు. కొలతలతో ప్రమేయం లేకుండా రోజుకు కూలీలకు రూ.700లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఫీల్డ్ అసిస్టెంట్లకు నెలకు రూ.26వేల వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు భీమయ్య, వెంకటేశ్, బాల్‌రాజ్, జంగయ్య, నర్సమ్మ, సునీత, వీరేషం, పాపయ్య పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం

- విరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- నేలరాలిన మామిడికాయలు



కేశంపేటలో విరిగిన విద్యుత్ స్తంభం

కేశంపేట: మండలంలో ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం పడటంతో మండలంలో కొన్ని గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగాయి. అదేవిధంగా పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండల కేంద్రంలోని మైసమ్మ దేవాలయం వద్ద చెట్టు కూలిపోవడంతో పాటుగా విద్యుత్ స్తంభం విరిగి నేలపైన పడిపోయింది. దీంతో సీఐ నరహరి సిబ్బందితో రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్టును తొలగించి రాకపోకల సౌకర్యం కల్పించారు. విద్యుత్ అధికారులు విద్యుత్‌ను పునరుద్ధరించే పనుల్లో బిజీగా ఉన్నారు. ఆయా గ్రామాల్లో మొక్కజొన్న, వరి పంటలకు తీవ్ర నష్టం జరిగింది. మామిడికాయలు నేలరాలాయి.



కేశంపేటలో రోడ్డుపైన విరిగిన చెట్టును తొలగిస్తున్న పోలీసులు



వేములనర్వలో కురుస్తున్న వర్షం

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కొందుర్గులో గ్రంథాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, గ్రంథాలయ సంస చైర్మన్

కొత్తూరు: గ్రంథాయాలు విజ్ఞాన భాండాగారాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలో సుమారు రూ.82లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రంథాలయాన్ని ఆయన సోమవారం గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం జాతీయ రహదారి నుంచి కేజీబీవీ హాస్టల్ వరకు రూ. 1 కోటితో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు, నిరుద్యోగుల కోసం గ్రంథాలయాల్లో ఆయా పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో నిర్వహించే పోటీ పరీక్షల కోసం సిద్ధమయ్యే విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భవిష్యత్‌లో చదువుకున్న వారికే అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఉంటుందనే విషయాన్ని గ్రహించి లక్ష్య సాధనకు కృషి చేయాలని యువతకు సూచించారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

రాజకీయాలకు అతీతంగా మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. పక్కా ప్రణాళికతో కొత్తూరును రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మున్సిపాలిటీ అభివృద్ధి కోసం పెద్దమొత్తంలో నిధులు సైతం ప్రభుత్వం మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, వైస్ చైర్మన్ డోలి రవీందర్, నాయకులు సుదర్శన్‌గౌడ్, దేవేందర్‌ముదిరాజ్, నర్సింహ, సురేందర్, దేవేందర్‌యాదవ్, యాదయ్య, దేవ్‌సింగ్, లైబ్రేరియన్ శ్రీనివాస్‌రాజు, మున్సిపల్ కమిషనర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

కొందుర్గు: అభివృద్ధి పనులకు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల కేంద్రంలో నూతన గ్రంథాలయ భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయ భవన నిర్మాణం కోసం రూ.1.20 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఇందుకుగాను టెండర్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. గ్రంథాలయ భవనం నిర్మాణానికి గ్రామస్తులు పెద్ది శ్రీనివాస్‌గుప్తా సోదరులు తమ తాత రామచంద్రయ్య జ్ఞాపకార్థం 600 గజాల స్థలం బహూకరించారు. ఈ సందర్భంగా స్థల దాతలను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ చైర్మన్ మదన్‌మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ వీరేషం, ఏఎంసీ వైస్ చైర్మన్ బాబార్, తహసీల్దార్ రమేశ్‌కుమార్, ఎంపీడీఓ లక్ష్మిఅనురాధ, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి, రాజు, నాయకులు పాల్గొన్నారు.